క్లుప్తంగా

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



చెలిమి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

జగిత్యాల: అవకాశాలను అందిపుచ్చుకోవాలని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాలలోని ఓల్డ్ హైస్కూల్‌లో చెలిమి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలు, యువత వారు ఎదుగుతున్న క్రమంలో ఎన్నోరకాల ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. జీవితంలో ఎదురయ్యే అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడమే చెలిమి కార్యక్రమమన్నారు. గతేడాది కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టి సత్ఫలితాలు సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పైలెట్‌గా జిల్లాకో పాఠశాలను చెలిమి కార్యక్రమంలో ఎంపిక చేసిందన్నారు. హెచ్‌ఎం రామానుజం, ఉపాధ్యాయులు ఆనందరావు, రజిత పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

జగిత్యాల: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, ప్రీస్కూల్ విద్యను తప్పనిసరిగా అందించాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు గురువారం ఎల్జీగార్డెన్స్‌లో ఐసీడీఎస్ నియోజకవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీ సేవలు పటిష్టంగా అందించేందుకుగాను రూపొందించిన పోషణ్ ట్రాకర్ ఎన్‌హెచ్‌టీఎస్ అప్లికేషన్ దరఖాస్తులో కేంద్రానికి హాజరైన తల్లులు, పిల్లల వివరాలు, పోషకాహార వినియోగం వివరాలను ప్రతిరోజు అందించాలన్నారు. పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌అధికారి వీరలక్ష్మీ, సూపర్ వైజర్ పద్మావతి, స్వరూపరాణి పాల్గొన్నారు.

రూ.10కోట్లతో అన్నివార్డుల్లో మౌళిక వసతులు



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుజాత

మెట్‌పల్లి: పట్టణంలోని అన్నివార్డుల్లో రూ.10 కోట్ల నిధులతో మౌళిక వసతులు కల్పిస్తున్నట్లు చైర్‌పర్సన్ రాణవేని సుజాత పేర్కొన్నారు. స్థానిక 18వార్డులో రూ. 20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు గురువారం చైర్‌పర్సన్ భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతర్గత రహదారుల అభివృద్ధికి, డ్రెయినేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్ చెట్లపల్లి మీనా, మాజీ కౌన్సిలర్ సుఖేందర్‌గౌడ్ ఉన్నారు.

జెడ్పీచైర్‌పర్సన్‌ను కలిసిన పీడీ



పుష్పగుచ్ఛం ఇస్తున్న పీడీ నరేశ్

జగిత్యాలరూరల్: జగిత్యాల డీఆర్డీఏ పీడీగా బాధ్యతలు స్వీకరించిన నరేశ్ గురువారం జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జెడ్పీ సీఈవో రామానుజచార్యులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు స్మార్ట్ టీవీ



టీవీ అందజేస్తున్న యూత్ సభ్యులు

ధర్మపురి: మండలంలోని దోనూర్ ప్రభుత్వ పాఠశాలకు రూ.20వేలు విలువైన స్మార్ట్‌టీవీని బహూకరించారు. గ్రామానికి చెందిన నవయువ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం టీవీని బహూకరించారు. బోధన అభ్యసన కార్యక్రమానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యూత్ చేపట్టిన కార్యక్రమంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాశెట్టి రమేశ్, ఉపాధ్యాయులు, నవయువ యూత్‌సభ్యులు తదితరులున్నారు.

పరిహారం మంజూరు

కథలాపూర్: మండలంలో గతనెలలో కురిసిన వర్షాలకు ఇళ్లు నష్టపోయిన వారికి ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని తహసీల్దార్ ముంతాజిబోద్దీన్ గురువారం తెలిపారు. మండలంలోని గ్రామాల్లో 22 ఇళ్లకు నష్టంవాటిల్లిందన్నారు. ఒక్కో బాధితుడికి రూ.3,200 చొప్పున పరిహారం రూ.70,400 మంజూరైందన్నారు ఈ మేరకు రెవెన్యూ అధికారులు గ్రామాలవారీగా బాధితులకు అందిస్తారన్నారు. బాధితులందరికీ పరిహారం అందుతుందన్నారు.

'జయహో చంద్రయాన్'

- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చంద్రయాన్ 3 విజయోత్సవ సంబరాలు
- చంద్రయాన్ –3 ఆకారంలో విద్యార్థుల మానవహారం, ర్యాలీ



కథలాపూర్‌లో చంద్రయాన్ -3 విక్రమ్ ఇంగ్లీష్ అక్షరాల ఆకారంలో కూర్చున్న మాస్త్రో విద్యార్థులు

కోరుట్ల/జగిత్యాలరూరల్/మల్లాపూర్/కథలాపూర్/సారంగాపూర్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో చంద్రయాన్ –3 విజయవంతంతో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కోరుట్ల బాలికల పాఠశాలలో చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా పాఠశాల ఆవరణలో సపోటా మొక్కలు నాటారు. కోరుట్లలోని సాయి జీనియస్ పాఠశాల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో యువజన సంఘాలు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ తీశారు. మల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇస్రో ఇంగ్లీష్ అక్షరాల ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి అభిమానం చాటుకున్నారు. కథలాపూర్ మాస్త్రో హైస్కూల్ విద్యార్థులు మానవహారంగా ఏర్పడి తమ అభిమానాన్ని చాటారు. 'చంద్రయాన్ -3 విక్రమ్' ఇంగ్లీష్ అక్షరాల ఆకారంలో కూర్చున్నారు. విజయవంతం కావడానికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సారంగాపూర్ బీర్‌పూర్ మండలం తుంగూర్ ప్రాథమిక పాఠశాలలో, జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చంద్రయాన్–3 విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.



'ఇస్రో' ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన



మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



జైహో భారత్ అంటున్న చిన్నారులు, విద్యార్థులు

ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగిఉండాలి



ట్రాఫిక్ ఎస్సై, ఏఎస్సైని సన్మానిస్తున్న మల్లయ్య



ట్రాఫిక్ నియమాలు వివరిస్తున్న ఆర్ఎస్సై కృష్ణ

జగిత్యాలక్రైం: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని ఆర్ఎస్సై కృష్ణ అన్నారు గురువారం ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో అల్ఫోర్స్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ గుర్తులు, రోడ్డుప్రమాదాల నివారణకుతీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం మానేసిన వాహనదారుడు

జగిత్యాలక్రైం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడటంతో పోలీసులు ఇచ్చిన కౌన్సెలింగ్‌తో మద్యం మానేసి తనకు స్ఫూర్తి కలిగించిన ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, ఏఎస్సై సందానిలను వాహనదారు బండారు మల్లయ్య సన్మానించారు. వివరాలు.. జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో 15రోజుల క్రితం ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, ఏఎస్సై సందాని డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. జిల్లా కేంద్రానికి చెందిన బండారి చిన్నమల్లయ్య డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దీంతో అతడికి మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలపై కౌన్సెలింగ్ ద్వారా హితబోధ చేశారు. ఈక్రమంలో మల్లయ్య తాను ఇక మద్యం తాగనని, తాను మద్యం మానేసేలా కృషి చేసిన ట్రాఫిక్ ఎస్సై ఏఎస్సైలను గురువారం సన్మానించారు.

రాత్రివేళ రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు

కోరుట్ల: పట్టణంలో యువకులు రాత్రి 11 గంటల తర్వాత కారణం లేకుండా బైక్‌లతో రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఈమేరకు బుధవారం అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న పలువురు యువకులను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రివేళ బయటకు వెళ్లనీయొద్దన్నారు. కేసులు నమోదుచేసి బైక్ సీజ్ చేస్తామన్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

స్వశక్తి సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



క్షీరాభిషేకం చేస్తున్న స్వశక్తి సంఘం సభ్యులు

జగిత్యాలరూరల్: గ్రామాల్లోని స్వశక్తి సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. గురువారం మండల సెర్ప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్థిక సామాజిక సేవలతో పాటు, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మహిళా సభ్యులు ఆర్థికంగా ఎదిగేలా ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. అనంతరం చంద్రయాన్–3 విజయవంతానికి కృషిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. చంద్రయాన్–3 చాయచిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీసీలు గంగారాం, రాజేందర్, సంతోష్, రవీందర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పొలస్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు సీఎం కేసీఆర్ మళ్లీ అసెంబ్లీ టికెట్ కేటాయించడంతో గురువారం పొలాస పొలస్తేశ్వరస్వామి ఆలయంలో ఆలయచైర్మన్ కొండాల్‌రావుతో పాటు, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి అభిషేకం నిర్వహించారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలవాలని మొక్కుకున్నారు. వైస్‌చైర్మన్ రంగు రాజయ్య, డైరెక్టర్లు భూమయ్య, రాజలింగంమహేశ్, తిరుపతమ్మ, బేబిరాణి రాజు, మేనేజర్ కొండ్ర రవి, అర్చకులు గోవర్ధనశర్మ, గోపాల్‌శర్మ పాల్గొన్నారు.

పేదప్రజలకు తొమ్మిదేళ్లలో ఒరిగిందేమిటి?



మహిళలతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

వెల్గటూర్: గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గడప గడపకూ గజరాజు కార్యక్రమంలో భాగంగా గురువారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు 3 ఎకరాల భూమి ఉత్తమాటేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీ అధికారంలోకి వస్తేపేదలసమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ గొల్లపల్లి మండల అధ్యక్షుడు కల్లెపల్లి తిరుపతి, రాజారాంపల్లి గ్రామాధ్యక్షుడు మంతెన సాయికుమార్, బీవీఎఫ్ మండల కన్వీనర్ మంతెన శేఖర్, స్వామి, సోషల్ మీడియా కన్వీనర్ బచ్చల అంజి పాల్గొన్నారు.

జీపీ భవనానికి స్థలపరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

రాయికల్: మండలంలోని మూటపల్లి చింతలూరు గ్రామపంచాయతీల భవనాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు కాగా, గురువారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థలాలు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఖయ్యూం, సర్పంచులు అనుపురం శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మేడిపెల్లి: దివ్యాంగులకు ఆసరాపెన్షన్లు పెంచినందుకు కాచారంలో గురువారం వికలాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు సర్పంచ్ చిట్యాల సురేశ్ మాట్లాడుతూ.. వికలాంగులకు రూ.3,016 నుంచి రూ.4,016 పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ లింగారెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు సూరకంటి రవి, సాయికృష్ణ, భూరాన్, గంగాధర్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

బుగ్గారం: సాంకేతిక కారణాలతో అర్హత కోల్పోయిన వారిని డబుల్ బెడ్‌రూం జాబితాల్లో చేర్చాలని సర్పంచ్ దమ్ము శ్రీలత గురువారం కలెక్టర్ యాస్మిన్‌బాషాకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో కొన్ని రోజుల క్రితం సాంకేతిక కారణాలతో నిరుపేదలైన 11 మందిని డబుల్ బెడ్‌రూం జాబితాలో అనర్హులుగా ప్రకటించారని, అందుకు అధికారులు స్పందించి పూర్తి విచారణ జరిపి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.

నియామకం



కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామానికి చెందిన ఆకుల సంతోష్‌ను ఎన్ఎస్‌యూఐ వేములవాడ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ఉత్తర్వులు జారీచేశారు. గురువారం కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ సంతోష్‌కు నియామక పత్రం అందించి శాలువాతో సన్మానించారు. సంతోష్ నియామకంపై ఎంపీటీసీ పులిశిరీషా, మండల కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, హరిప్రసాద్, రేహన్ హర్షం వ్యక్తం చేశారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు

కోరుట్లటౌన్: పట్టణంలోని పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని హోటళ్లకు జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు హక్కులు తెలుసుకోవాలి



జగిత్యాల: మహిళలు తమ హక్కులు తెలుసుకోవాలని మహిళా సాధికారత అధికారి అశ్విని అన్నారు. పట్టణంలోని రామకృష్ణ, నలంద డిగ్రీ కళాశాలలో మహిళల సాధికారత అంశంపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళలకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని, టోల్‌ఫ్రీ నంబర్లు ఇతర రక్షణ అవకాశాలున్నాయని, ప్రతి ఒక్కరు వీటిని వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు గౌతమి, హేమశ్రీ పాల్గొన్నారు.

జీపీ భవనం ఏర్పాటుకు భూమి విరాళం



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో, తహసీల్దార్

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో గ్రామపంచాయతీ భవనం ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ మాజీచైర్మన్ లోక బాపురెడ్డి 4గుంటల భూమి విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు స్థలాన్ని పరిశీలించారు. జీపీ భవనం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేయడంతో భవనం ఎటువైపు నిర్మించాలనే విషయంలో పంచాయతీరాజ్‌శాఖ, రెవెన్యూ అధికారులు చర్చించారు. కాగా 4గుంటల భూమిని తన నాయనమ్మ లోక గంగవ్వ జ్ఞాపకార్థం ఇస్తున్నట్లు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి తెలిపారు. బాపురెడ్డిని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శంకర్, తహసీల్దార్ ముంతాజిబోద్దిన్, ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, ఏఈ ఆదిత్య, ఆర్ఐ నాగేశ్, సర్పంచ్ కూన సులోచన, కార్యదర్శి ఎండీ. గపూర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్ హైస్కూల్‌లో మాక్ పోలింగ్



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో విద్యార్థులు



ఎన్నికల అధికారులుగా విద్యార్థులు

- ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించి ఓటువేసిన విద్యార్థులు

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవులకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. బ్యాలెట్ పేపర్, పోలింగ్‌బాక్స్ ఏర్పాటుచేసి ఎన్నికలు నిర్వహించారు. పోటీదారులకు గుర్తులతో పాటు నోటా కూడా ఏర్పాటుచేశారు. ఓటువేయడంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు క్యూపద్ధతి పాటించి ఓటువేశారు. ఎన్నిక అనంతరం కౌంటింగ్ నిర్వహించారు. కెప్టెన్‌గా పదోతరగతి విద్యార్థి బర్కం అభిషేక్, వైస్‌కెప్టెన్‌గా 9వ తరగతి విద్యార్థి ఎండీ. అఫ్రోజ్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం హరివరప్రసాద్, సోషల్ టీచర్ల రోజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నాయకులు

కోరుట్ల: రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని జగిత్యాల జిల్లా తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. ఈమేరకు పట్టణంలోని పలు పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పదోన్నతులు, బదిలీలు, చేపట్టడంతో పాటు నూతన పీఆర్సీ కమిటీ వేయాలన్నారు. 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తపస్ ప్రధానకార్యదర్శి బోయినపల్లి ప్రసాద్‌రావు, మండల అధ్యక్షుడు గాడిపెల్లి అంజయ్య, ప్రధానకార్యదర్శి దాసరి రమేశ్, అందె శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై గ్రామస్తులకు అవగాహన



పెగడపల్లి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటింగ్ చేయు విధానంపై గురువారం అవగాహన కల్పించారు. సాధారణ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏడుమోటలపల్లి, ఐతిపల్లి, నందగిరి గ్రామాల్లో ఈవీఎంలపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సర్పంచులు రవినాయక్, కొండయ్య, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుకు స్పెషల్ డ్రైవ్

మల్యాల: మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని మల్యాల తహసీల్దార్ మునీందర్ అన్నారు. మల్యాల మండలంలో శనివారం, ఆదివారం రోజుల్లో ఓటుహక్కునమోదుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్‌స్టేషన్ల వద్ద బూత్‌లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభాకర్

మల్లాపూర్: సీఎం కేసీఆర్ నియంత పాలనకు స్వస్తి పలికి తెలంగాణలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని వీవీరావుపేటలో బాధిత కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అని, కుటుంబ పాలనలో బందీ అయిన తెలంగాణను విముక్తి చేయడానికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల వాగ్దానాలను విస్మరించి అన్ని వర్గాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనవెంట మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, మెట్‌పల్లి కౌన్సిలర్ జక్కని కుందన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, నాయకులు చింతకింది రాజు, మిట్టపెల్లి కృష్ణమూర్తి, పోతు గోపి, జక్కని ప్రభు తదితరులు ఉన్నారు.

బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా పడాల తిరుపతి



రాయికల్: బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా రాయికల్ మండలం కట్కాపూర్‌కు చెందిన పడాల తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి మాట్లాడుతూ.. తన నియమకానికి కృషిచేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషిచేస్తానన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేందర్‌రెడ్డి



మెట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన న్యాయవాది ఏలేటి నరేందర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ అరవింద్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చేఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానన్నారు.